సాక్షి
ఏలూరు
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



చోరీ కేసులో అరెస్టు

లింగపాలెం మండలంలో చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పట్టుకుని, సొమ్మును పోలీసులు రికవరీ చేశారు. 8లో ▸



జోరు వాన.. నరకయాతన

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సోమవారం వర్షం దంచికొట్టింది. రోడ్లు అధ్వానంగా ఉండడంతో గుంతలు తెలియక వాహనచోదకులు అవస్థలు పడ్డారు. 8లో ▸



శివశివా.. ఇదేం దారుణం?

ద్వారకా తిరుమల భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో హోమాన్ని తాపీ గమేళాలో నిర్వహించడం పట్ల పలువురు భక్తులు మండిపడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

జేసీగా అభిషేక్ గౌడ బాధ్యతల స్వీకరణ



ఎం.జె.అభిషేక్ గౌడ, జేసీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా ఎం.జె.అభిషేక్ గౌడ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరు కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పౌరసరఫరాల శాఖ మరింత పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభంకానున్న దృష్ట్యా ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టరును జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్ కలిసి స్వాగతం పలికారు.

మరో రెండ్రోజులు భారీ వర్షాలు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో రెండ్రోజుల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాలకు రావద్దని, చెట్ల కింద, శిథిల భవనాల వద్ద నిలబడవద్దని, ఉరుముల సమయంలో రైతులు పొలాలకు దూరంగా ఉండాలని కోరారు. భారీ వర్షాల కారణంగా పొంగుతున్న కాజ్‌వేలు, కల్వర్ట్‌లు, వాగులు దాటవద్దని, అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: జిల్లాలోని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ డీపీ వేణుగోపాల్ పత్రికా ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని రసీదు పొందాలని సూచించారు. వివరాలకు 08816 297093, 96664 07468 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



భీమవరంలో మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

భీమవరం: మునిసిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా నవంబరు 3 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు చెప్పారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి అందచేసిన సందర్భంగా మాట్లాడారు. మృతి చెందిన, రిటైర్డు, అవుట్ సోర్సింగ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని, 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, పెరిగిన జనాభా కనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 62 ఏళ్లకు పదవీవిరమణ వయస్సును పొడిగించాలని, సులభ్ నిర్వహణ మునిసిపల్ కార్మికులకు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు ఇల్లు, ఇళ్ళ స్థలాలు కేటాయించి మున్సిపల్ కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

తపాలా శాఖలో అందుబాటులోకి కొత్త సేవలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా భీమవరం సర్ సీవీ రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టల్ సంక్షేమ పథకాలపై అవగాహన, కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ యూనియన్ లీడర్ లెనిన్ బాబు మాట్లాడుతూ తపాలా శాఖ ప్రస్తుతం నూతన సాంకేతికత వినియోగించుకుంటూ కొత్త సేవల ద్వారా ప్రజలకు సేవలందిస్తుందని, పోస్టల్ శాఖలో అందించే సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.పార్వతి, ఉపాధ్యాయులు ఎం.శైలజ, ఎన్.రాధా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై కన్నెర్ర

- ఎక్సైజ్ కార్యాలయాల వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన కార్యక్రమాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు
- జోరు వానలోనూ కొనసాగిన ఆందోళనలు



కైకలూరు జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'ఎన్' బ్రాండ్ మద్యం, నకిలీ మద్యంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు అందజేసింది. నకిలీ మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చేసి సొమ్ములు చేసుకుంటున్నారని, టీడీపీ నేతలు ప్రజల రక్తమాంసాలు దోచేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం జోరువానలో కూడా పలు నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.

తణుకు నియోజకవర్గంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం కొనసాగింది. పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సీఐ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చీప్ లిక్కర్ బాటిళ్లను ఎక్సైజ్ సీఐ కార్యాలయం ముందు పారబోసి ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కారుమూరి మాట్లాడుతూ ప్రజల రక్తమాంసాలతో ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని, ఇంటికో ఉద్యోగం కాకుండా ఊరూరా మద్యం కుటీర పరిశ్రమ పెట్టి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. నకిలీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కైకలూరులో..

కైకలూరు నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు నేతృత్వంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ నకిలీ మద్యం ముఠా గుట్టు రట్టు చేయాలని, సర్కారు అండదండలతోనే మద్యం కుటీర పరిశ్రమగా మారిందని ధ్వజమెత్తారు.



పోలవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు



తణుకులో ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కారుమూరి

ఏలూరులో..

ఏలూరులో పార్టీ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. సెయింట్ థెరిస్సా కాలేజీ సెంటరులో ఉన్న దివంగత వైఎస్సార్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం న్యూ అశోక్‌నగర్‌లోని ఎక్సైజ్ డీసీ కార్యాలయం వద్ద నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ నకిలీ మద్యం విక్రయాల్లో కూటమి నేతలే పాత్రధారులు, సూత్రధారులని సీబీఐ విచారణ నిర్వహించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ధ్వజమెత్తారు. ఏలూరులో వైన్‌షాపులో ఒక వ్యక్తి మద్యం సేవించి మృతి చెందింతే ఆ బ్యాచ్ మద్యం సీసాల మొత్తాన్ని మాయం చేశారని దీనిపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నూజివీడులో..

నూజివీడులో సమన్వయకర్త మేకా ప్రతాప అప్పారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. నకిలీ మద్యంతో ప్రభుత్వ ఆదాయానికి కూటమి నేతలు గండికొడుతూ వ్యక్తిగత ఆదాయాన్ని పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

పోలవరం నియోజకవర్గంలో.. పోలవరంలో పార్టీ సమన్వయకర్త తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై నిరసన తెలియచేస్తూ పోలవరంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ నకిలీ మద్యం అంతమయ్యేవరకు పోరాటం కొనసాగుతుందని పిలుపునిచ్చారు. కూటమి నేతలే నకిలీ మద్యం సిండికేట్ నడుపుతున్నారని తెలిసినా ప్రభుత్వం మాత్రం చోద్యం చూడడం నీతిమాలిన చర్య అని ధ్వజమెత్తారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలులో ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ నేతృత్వంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందచేశారు. నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చి ఇప్పుడు బహిర్గతం కాగానే దాన్ని వైఎస్సార్‌సీపీపై మోపడానికి కూటమి నేతలు చేస్తున్న కుట్రలను ప్రజలందరూ గమనిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసులో పట్టుబడిన వ్యక్తులందరూ చంద్రబాబు, లోకేష్‌కు సన్నిహితులని సీబీఐ విచారణ జరిగితేనే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు.

చింతలపూడిలో..

చింతలపూడి నియోజకవర్గంలో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు ఆధ్వర్యంలో చింతలపూడి ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నకిలీ మద్యం రాకెట్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కోట్లు దండుకుంటుందని ధ్వజమెత్తారు.

పాలకొల్లు నియోజకవర్గంలో..

పాలకొల్లు నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి నేతృత్వంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు. నకిలీ మద్యంలో టీడీపీ పెద్దల పేర్లు బయటకు రాకుండా కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు తెరతీసి వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతుందంటూ మండిపడ్డారు.



ఏలూరులో ఆందోళన చేస్తున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్ తదితరులు



నూజివీడులోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



భీమడోలులో ర్యాలీ చేస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్



చింతలపూడి ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలి

జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలను సాధించేందుకు పటిష్టమైన ప్రణాళికతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో సోమవారం ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాలు, ప్రణాళికలపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని, ఒక్క రైతుకీ ఎలాంటి సమస్య రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలు, తేమ శాతం తదితర సమస్యలు, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యం సేకరణలో రైతులు, మిల్లర్లు, రవాణా పరమైన ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, డీఎస్‌ఓ విలియమ్స్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు శివరామమూర్తి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్‌కె హబీబ్ బాషా, డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణపై సమీక్ష

తణుకు అర్బన్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని పార్టీ శ్రేణులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజలకు చేరువచేయాలని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సూచించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదవర్గాల పిల్లలకు వైద్యవిద్యను అందించాలని, పేదలకు నాణ్యమైన వైద్యాన్ని కళాశాలల ద్వారా నైపుణ్యం కలిగిన వైద్యులచే చేరువ చేయాలన్న కలలతో రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలకు సంకల్పించి విజయవంతమయ్యారని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఆ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసి వారి వర్గాలకు పట్టం కట్టాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు. రచ్చబండ, సంతకాల సేకరణ, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రాల వరకు సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలపై పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి సోమవారం కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అధికారులు అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదు పరిష్కారానికి సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడాలని అన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు అభిషేక్ గౌడ, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన జనజీవనం

- ఏలూరు జిల్లాలో కుండపోత వాన
- ఏలూరు పట్టణంలో నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- ఏజెన్సీలో పొంగిన వాగులు, వంకలు



చెరువును తలపిస్తున్న ఏలూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం



బుట్టాయగూడెం మండలంలోని ఐటీడీఏకు వెళ్లే మార్గంలో వాగు ప్రవాహం

ఏలూరు(మెట్రో): జిల్లా వ్యాప్తంగా సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉదయమే ప్రారంభమైన వర్షం ఉరుములు, పిడుగులతో జిల్లాను తడిసి ముద్దచేసింది. జిల్లా వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా వర్షపాతం నమోదవుతున్నప్పటికీ సోమవారం వేకువ జాము నుంచే ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఏలూరు ప్రాంతంలో వర్షం ముంచెత్తింది. మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలో కొండవాగులు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం కావడంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. జిల్లా కేంద్రానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉదయం 8.30 గంటల వరకు 388.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అధికంగా కైకలూరులో 87.4 మి.మీ, బుట్టాయగూడెంలో 40.8, కొయ్యలగూడెంలో 38.2, ద్వారకాతిరుమలలో 35, జంగారెడ్డిగూడెంలో 34.6, కలిదిండిలో 26.6, ముదినేపల్లిలో 25.4, ఏలూరు నగరంలో 21.6, మండవల్లిలో 20.6, కుక్కునూరులో 11.2, ఏలూరు రూరల్ మండలంలోని 9.6, ఉంగుటూరు 9.4, పోలవరంలో 8, పెదపాడులో 6.8, వేలేరుపాడులో 6.4, జీలుగుమిల్లిలో 2.4, భీమడోలులో 1.8, నూజివీడులో 1.2, నిడమర్రులో 1.2, లింగపాలెంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం సైతం వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరించింది.



వర్షపు నీటిలో మునిగిన స్నేహ వారధి



ఏలూరులో జలమయమైన జీజీహెచ్ మెయిన్ రోడ్డు



కన్నాపురంలో పడమటి కాలువ ఉధృతి

క్లుప్తంగా

పూజారి ముసుగులో గంజాయి విక్రయం

గుంతకల్లు: ఆలయ పూజారి ముసుగులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరొకరిని సోమవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపిన వివరాల ప్రకారం గుంతకల్లులోని హనుమస్ సర్కిల్‌లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే అడ్డుకుని పరిశీలించారు. వారి వద్ద 4 కిలోల ఎండు గంజాయి గుర్తించి అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఏలూరు జిల్లా వెంకటాపురంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న పూజారి సురేష్‌బాబు కుమారుడు తిరునగరి మోహన్‌సుందర్ జల్సాలకు అటువాటు పడి పలు దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని గుత్తి మండలం అబ్బేదొడ్డికి చేరుకుని రామాలయంలో అర్చకుడిగా చేరాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో తన భార్య బంధువుల సాయంతో గంజాయి తీసుకొచ్చి అబ్బేదొడ్డికి చెందిన సాయిరామ్ అలియాస్ గంజాయి సాయి ద్వారా గుత్తి, గుంతకల్లు పట్టణాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టాడు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు జ్యూట్‌మిల్లు వంతెన ప్రాంతంలో ఒక వ్యక్తి రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జ్యూట్ మిల్లు రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై ఒక గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళుతుండగా వెనుకవైపు నుంచి వస్తోన్న రైలు ఢీకొట్టింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించేందుకు ప్రయత్నించగా ఆధారాలు ఏమీ లభించలేదని రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలకు పైబడి ఉంటుందనీ, టీషర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఒక కన్ను పని చేయడం లేదనీ, ఒక చెయ్యి సగమే ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన ఏలూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్: మద్యం సేవిస్తున్న భర్తను భార్య మందలించడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రూరల్ హెచ్‌సీ జిలానీ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మోదుగగుంట గ్రామానికి చెందిన దండ్రు వెంకట్రావు (50) రోజూ మద్యం సేవించి ఇంటికి రావడంతో ఆదివారం భార్య వెంకటనర్సమ్మ నిలదీసింది. దీంతో వెంకట్రావు మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. అతనిని తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువు దండ్రు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ జిలానీ తెలిపారు.

జోరు వాన.. నరకయాతన

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సోమవారం వర్షం దంచికొట్టింది. తెల్లవారు జాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో కూలీలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎనిమిది గంటలైనా వాన తగ్గకపోవడంతో ఇక చేసేది రెయిన్‌కోట్లు, గొడుగుల సాయంతో తమ తమ విధులకు వెళ్లారు. అయితే భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా రోడ్లు అధ్వానంగా ఉండడంతో గుంతలు తెలియక వాహనచోదకులు అవస్థలు పడ్డారు. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై మోకాలు లోతు నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఏలూరు: జలమయమైన పవరుపేటస్టేషన్ సెంటర్



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరువాగు



ఉండి: గోరింతటలో నీటమునిగిన ప్రాథమిక పాఠశాల



ఏలూరు: వర్షపునీటిలో మునిగిపోయిన ఏలూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం



పాలకొల్లు సెంట్రల్: చెరువును తలపిస్తున్న పాలకొల్లు బస్టాండ్



బుట్టాయగూడెం: దేవుడు మాన్యంలో పిడుగుపాటుతో మృతి చెందిన ఆవులు

శివశివా.. ఇదేం దారుణం?

- క్షేత్రపాలకుని ఆలయంలో యాగశాల షెడ్డు తొలగింపు
- వర్షం కురవడంతో ఆలయ మండపంలో రుద్ర హోమం నిర్వహణ

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం జరిగిన రుద్ర హోమాన్ని వీక్షించిన భక్తులు శివశివా.. ఇదేం దారుణమంటూ ముక్కున వేలేసుకున్నారు. శాస్త్రోక్తంగా హోమకుండంలో జరగాల్సిన ఈ హోమాన్ని తాపీ పనులకు వినియోగించే గమేళాలో నిర్వహించడం పట్ల పలువురు భక్తులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే శివదేవుని ఆలయంలో ధ్వజస్తంభం ఎదురుగా, ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న యాగశాల షెడ్డులో ప్రతి సోమవారం రుద్ర హోమాన్ని జరుపుతారు. అందులో రూ.516 లు రుసుము చెల్లించి దంపతులు పాల్గొంటారు. ఇదిలా ఉంటే వేరే ప్రాంతంలో యాగశాలను నిర్మించే ఉద్దేశంతో, దేవస్థానం అధికారులు మూడు రోజుల క్రితం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రస్తుత యాగశాల షెడ్డును ఆకస్మాత్తుగా తొలగించారు. అయితే అందులో హోమకుండం భాగానే ఉండడంతో అర్చకులు సోమవారం ఉదయం ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి, హోమ నిర్వహణకు అంతా సిద్ధం చేశారు. ఇంతలో వర్షం కురవడంతో అర్చకులకు ఏం చేయాలో? పాలుపోలేదు. అప్పటికే నలుగురు భక్తులు హోమంలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ టికెట్లను కొనుగోలు చేశారు. అలాగే భక్తులు ఉన్నా.. లేకపోయినా ఈ హోమాన్ని జరపడం పరిపాటి. దాంతో అర్చకులు తప్పనిసరి పరిస్థితుల్లో, వేరే గత్యంతరం లేక ఆలయ మండపంలో, తాపీ పనులకు వినియోగించే గమేళాలో ఈ రుద్ర హోమాన్ని నిర్వహించారు. ఇది చూసిన భక్తులు విస్తుపోయారు. శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, పురాణ ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయంలో ఇలాంటి పరిస్థితులను చూసిన భక్తులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. అయితే ఈ ఘటనపై సెక్షన్ సూపరింటిండెంట్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ షెడ్డు తొలగించిన వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నది వాస్తవమేనని అంగీకరించారు. అయితే ఇంజనీరింగ్ సెక్షన్ వాళ్లు పనిలోపడి మర్చిపోయారని, వర్షం కారణంగా ఉదయం టెంటు నిర్మించడం కుదరలేదన్నారు. అర్చకులు ప్రత్యామ్నాయంగా ఆలయంలో రుద్ర హోమాన్ని జరిపారన్నారు.



క్షేత్రపాలకుని ఆలయంలో గమేళాలో హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

యువకుడిపై యువతి ఫిర్యాదు

ఉండి: ప్రేమ పేరుతో వంచించిన యువకుడిపై యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన 27 ఏళ్ల యువతిని చిలుకూరు గ్రామానికి చెందిన బొబ్బిలి కల్యాణ్ అనే యువకుడు ప్రేమపేరుతో వెంట తిరిగేవాడు. ఈ నెల 6 రాత్రి యువతి వద్దకు వెళ్ళిన యువకుడు వారి వివాహ విషయంతో తన తల్లి,అన్నయ్య ఇద్దరూ ఒప్పుకోవడం లేదంటూ ఆమెకు సర్ది చెప్పే ప్రయత్నం చేయడంతో యువతి కేకలు వేసింది. ఆ సమయంలో నిద్రలేచిన ఆమె తండ్రి,అన్నయ్య యువకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో యువకుడి ఇంటికి వెళ్లిన యువతి కుటుంబ సభ్యులు జరిగిన విషయం చెప్పి పెళ్లి చేయమని కోరగా వారు నిరాకరించారు. దీంతో యువతి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఏఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

చింతలపూడి/లింగపాలెం: ఇటీవల లింగపాలెం మండలంలో చైన్ స్నాచింగ్ , దొంగతనాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పట్టుకుని, సొమ్మును రికవరీ చేసినట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. ఏలూరు పట్టణానికి చెందిన చవల భార్గవ కృష్ణ, భరగడ హర్ష వర్ధన్, కాకర్లపర్తి గణేష్, బద్ది హేమ అచ్యుత్, కోలా అప్పల రాజు గత నెల 23న ధర్మాజీగూడెంలో ఒడ్డు కట్టు చెరువు రోడ్డు బాపిరాజు గూడెంలో బొల్లా నాగలక్ష్మి నుంచి బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కుని ద్విచక్ర వాహనాలపై పారిపోయారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ టి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ధర్మాజిగూడెం ఎస్సై వెంకన్నబాబు సిబ్బందితో కలిసి సోమవారం ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి పలు నేరాల్లో సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు అలవాట్లకు, సులభంగా డబ్బు సంపాదించాలి అనే ఆశతో చదువుకునే యువత దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



చింతలపూడి సీఐ కార్యాలయంలో నిందితులతో పోలీసు అధికారులు

బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు

అనధికారికంగా బాణసంచా నిల్వ చేసిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవిచంద్ర హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో మండలంలోని పలు ప్రాంతాల్లో అనధికారకంగా బాణసంచా నిల్వ ఉంచిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో ప్రగడవరం గ్రామంలో మూడు చోట్ల ఐదు లక్షల విలువైన అక్రమ మందు బాణసంచా గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

చోరీకి యత్నించి.. దాడిలో గాయపడి..!

ఏలూరు టౌన్: ఏలూరు ఎస్ఆర్ పేట, కట్టా సుబ్బారావు వీధి ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా ఇంటి యజమాని అతడిని క్రికెట్ బ్యాట్‌తో కొట్టటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ గుర్తు తెలియని వ్యక్తిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అతను చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఏలూరు టూటౌన్ ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కట్టా సుబ్బారావు తోట ప్రాంతంలో వీరమాచినేని మృత్యుంజయబాబు తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఈ నెల 8న రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృత్యుంజయబాబు ఇంట్లోకి ప్రవేశించాడు. అతను చోరీ చేసేందుకు వచ్చాడా? మరే కారణమో తెలియదు గానీ... ఇంట్లోని వారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసేందుకు ప్రయత్నించగా, అతడి చేతిలోని బ్యాట్‌ను లాక్కున్న మృత్యుంజయబాబు అతడిపై దాంతో దాడి చేశాడు. ఈ దాడిలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన చికిత్సకు వైద్యులు విజయవాడ రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతిచెందాడు. ఈ సంఘటనపై వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విజయవాడలో జీజీహెచ్‌లో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన దేవస్థానం సత్రం గదిలోని బాత్‌రూమ్‌లో గడప తగిలి పడిపోయిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానిక ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ లోని యనమలకుదురు గ్రామానికి చెందిన యార్లగడ్డ నరేంద్రబాబు తన మేనకోడలి వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 11న ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేశాడు. ఇదిలా ఉంటే అర్ధరాత్రి తెల్లవారుజామున నరేంద్రబాబు తండ్రి యార్లగడ్డ సాంబశివరావు(80) కొండపైన ధర్మఅప్పారాయ నిలయం గదిలోని బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తూ, గడప తగిలి ముందుకు పడిపోయాడు. దాంతో తీవ్ర గాయాలు పాలైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు నరేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

కుక్కునూరు: కుక్కునూరు మీదుగా భద్రాచలం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తాకొట్టిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, తెలంగాణా రాష్ట్రం చర్ల గ్రామానికి చెందిన పాస్టర్ దంపతులు రాజమండ్రిలో సువార్త స్వస్థత సభలకు హాజరై తిరుగు ప్రయాణంలో భాగంగా కుక్కునూరు మీదుగా వారి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మండలంలోని కొర్లకుంట రామాలయం సమీపంలోని కల్వర్టు వద్ద రహదారిపై గుంటలను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి కల్వర్టుకు ఉన్న రైలింగ్‌కు ఢీకొని పక్కనే ఉన్న కాలువలో బోల్తాపడింది. అయితే ఈ ఘటనలో కారులో ఉన్న పాస్టర్ దంపతులకు ఎలాంటి గాయాలు కాలేదు.



బోల్తా పడిన కారు

పోలవరం భూసేకరణ అక్రమాలను అడ్డుకుంటాం



పోలవరం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు



అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ధవళేశ్వరం: పోలవరం ప్రాజెక్టు భూసేకరణకు తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అక్రమాలను అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లోని 20 గ్రామాల గిరిజనులు తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కాటన్ బ్యారేజీ సెంటర్ నుంచి వందలాది మంది ర్యాలీగా వెళ్లి, కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ, బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటి వరకూ 5 నోటిఫికేషన్లు ఇచ్చారని, ప్రతి దానిలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. గ్రామసభలు నిర్వహించలేదని, పెసా కమిటీల అనుమతులు సైతం లేకుండానే నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను భూస్వాముల పేరిట రికార్డుల్లో నమోదు చేశారని చెప్పారు. ఇలాంటి అక్రమాలను అడ్డుకుని, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల రక్షణకు ఏర్పాటైన చట్టాల అమలులో పాలనా యంత్రాంగం విఫలమవుతోందన్నారు. పోలవరం భూసేకరణ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని శ్రీనివాసరావు చెప్పారు. ప్రతి ఎకరాకు బహిరంగ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 1.05 లక్షల మంది నిర్వాసితులవుతున్నారని, ఇప్పటి వరకూ 12 శాతం మందికే పునరావాసం కల్పించారని, ఆలస్యంగా చేసినా అన్నీ అవకతవకలే వెలుగు చూస్తున్నాయని అన్నారు. ఆందోళన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్ వచ్చి గిరిజనులు, నాయకులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల అభ్యర్థనలను స్వీకరించారు. వాటిని పరిశీలిస్తామని, ఏలూరు జిల్లా కలెక్టర్, ఆర్డీఓలతో చర్చిస్తానని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా వ్యాప్తంగా కార్తీక మాసం సందర్భంగా భక్తులు పంచారామాలను దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా పంచారామ క్షేత్ర దర్శిని పేరిట బస్సు సర్వీసులు నిర్వహించడానికి ఏర్పాటు చేశామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి ఆదివారం రాత్రిళ్లు ఎనిమిది గంటలకు బయలుదేరి తిరిగి సోమవారం రాత్రికి గమ్యస్థానాలకి చేరుకుంటాయని పేర్కొన్నారు. జిల్లాలో ఏ డిపో నుంచి బయలుదేరినా ఒకే టికెట్టు ధర నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. ఎక్స్‌ప్రెస్‌కు రూ. 900, అల్ట్రా డీలక్స్‌కు రూ.1100, సూపర్ లగ్జరీకి రూ.1200గా టిక్కెట్టు ధర నిర్ణయించామని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని వివరించారు. ఒకే గ్రామం నుండి 36, 40 మంది భక్తులు ఉంటే ప్రత్యేక బస్సు సర్వీస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే నవంబరు, డిసెంబరు నెలలలో విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేస్తామని, అయ్యప్ప స్వాముల కోసం గురు స్వాములు కోరిక మేరకు వారికి నచ్చిన విధంగా ఎన్ని రోజులైనా స్పెషల్ ప్యాకేజీపై శబరిమలై ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. నేరుగా శబరిమలై వెళ్లి రావడానికి నాలుగు రోజులకి రూ. 4500, ఆరు రోజులకి రూ. 5500 ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. వీటితో పాటు కార్తీక మాసంలో ప్రతి శనివారం, ఆదివారం రాత్రి 8 గంటలకు శ్రీశైలం ప్రత్యేక బస్సు సర్వీసులు అన్ని డిపోల నుంచి ఏర్పాటు చేశామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏలూరు 63038 59484, జంగారెడ్డిగూడెం 94929 49350, నూజివీడు 99592 25461 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పారిజాతగిరి హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఏలూరు దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాబు నాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో 90 రోజులకు గానూ రూ. 12,88,615 ఆదాయం వచ్చినట్లు ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, గొట్టుముక్కల భాస్కరరాజు, వాసవీ సాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీజీపీ ఆత్మహత్యపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరపాలి



దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): హర్యానా రాష్ట్ర దళిత ఐపీఎస్, ఏడీజీపీ పురానాకుమార్ ఆత్మహత్య పై సుప్రీంకోర్టు జడ్జి తో విచారణ జరిపించాలి దళిత సేన నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దళిత జాతి కి చెందిన హర్యానా రాష్ట్రం ఐపీఎస్ ఏడీజీపీ పురానా కుమార్ కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి అందుకు కారకులైన హర్యానా రాష్ట్ర డీజీపీ, ఎస్పీలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ఈ ఆత్మహత్యపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాన్ని దళిత సేన తరుపున డిమాండ్ చేశారు. సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా దళిత సేన అధ్యక్షులు చీలి మోహనరావు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు దిరుసు పాము కృష్ణమూర్తి, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు పెదపాటి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి



బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న పారిశుధ్య కార్మికులు



జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తోన్న పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవటంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగం అధికారులకు ఎన్నిసార్లు వినతి చేసినా పట్టించుకోవటం లేదని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలోని ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏలూరు జీజీహెచ్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారంతా కుటుంబ పోషణ కష్టమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో యూనియన్ పిలుపు మేరకు ఏలూరు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేశారని తెలిపారు. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, భీమడోలు, నూజివీడు, కైకలూరు ఇలా అన్ని హాస్పిటల్స్ వద్ద కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. జిల్లాలోని వైద్యాధికారులు వెంటనే జీతాల చెల్లింపులకు ప్రభుత్వానికి నివేదించాలనీ, లేనిపక్షంలో ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరించారు.